www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి | భద్రాద్రి

శుక్రవారం | 10 | జూలై | 2026 | పేజీలు : 8



# సిఎం సారూ.. మా సమస్యలివే..?

ముఖ్యమంత్రిగా రైతు ఆశీర్వాద సభలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న మీకు స్వాగత సుమాంజలి. ఖమ్మం జిల్లా వ్యవసాయమే ప్రధానంగా కలిగిన జిల్లా. ఈ జిల్లాలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలో రెండున్నర లక్షల ఎకరాలు సాగవుతుండగా పాలేరు, వైరా, లంకా సాగర్ మొదలైన మధ్యతరహా నీటి ప్రాజెక్టుల ద్వారా 60వేల ఎకరాలు సాగవుతున్నాయి. చెరువులు, కుంటలతో పాటు వైరా, కట్టలేరు, మున్నేరు పరివాహక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. కానీ ఇవి గత కొంత కాలంగా పలు రకాల సమస్యలతో పని చేయడం లేదు. జిల్లా ను సస్యశ్యామలం చేయడంతో పాటు పైన పేర్కొన్న నీటి వనరుల పరిధిలోని ఆయకట్టును స్థిరీకరించేందుకు సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే పరిష్కార మార్గం. కృష్ణానదికి నీటి లభ్యత ఆధారంగా నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీరు అందుతుంది. సీతారామ ద్వారా పాలేరులో గోదావరి జలాలను కలిపినట్లయితే ఖమ్మం జిల్లాలో మొత్తం ఆయకట్టు స్థిరీకరణ జరగడంతో పాటు యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ప్రాంతానికి కూడా సాగునీరు అందుతుంది. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి అంచనాలు పెరుగుతుండటం, కేటాయింపులు ప్రతి యేటా క్రమేపి తగ్గుతుండటం మమ్మల్ని కలవరపరుస్తుంది. ఇప్పటికే ప్రాజెక్టు అంచనా కంటే తొమ్మిది వేల కోట్లు పెరిగింది. జాప్యం జరిగే కొద్ది అంచనాలు పెరుగుతుంటాయి. సత్వరం సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సరిపడ నిధులు కేటాయిస్తూ రైతు ఆశీర్వాద సభలో ప్రకటన చేయాల్సిందిగా కోరుతున్నాం. దశాబ్ద కాలంగా అతివృష్టో, అనావృష్టో, తెగుళ్లు, వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పంటల బీమా లేకపోవడంతో ఆరుగాలం కష్టపడి పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ప్రభుత్వం పలు రకాల కారణాలతో పంటల బీమాను ఎత్తివేసింది. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత పంటల బీమాను అమలు చేస్తామని చెప్పిన విషయం విధితమే. ఈ ఏడాది నుంచైనా పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టేవిధంగా రైతు ఆశీర్వాద సభలో ప్రకటన చేస్తారని కోరుతున్నాం. జిల్లాల విభజన తర్వాత భద్రాద్రి కొత్తగూడెంకు పరిశ్రమలు తరలిపోవడంతో ఖమ్మం జిల్లాలో గ్రానైట్ మినహా మరే పరిశ్రమ లేదు. ఉపాధి ఉద్యోగాల కల్పనకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. లక్షన్నర మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన గ్రానైట్ పరిశ్రమకు రాయితీలను ప్రకటించి ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. హైదరాబాద్, వరంగల్‌కు దీటుగా ఖమ్మం జిల్లాలో విద్యా వ్యవస్థ విస్తరించింది. పలు విద్యా సంస్థలు ఇక్కడ నెలకొల్పడంతో చుట్టు పక్కల జిల్లాలకు విద్యా కేంద్రంగా ఖమ్మం భాసిల్లుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లో ఖమ్మం మినహా ప్రతి జిల్లాలోనూ విశ్వ విద్యాలయాల స్థాపన జరిగింది. చైతన్యవంతమైన ప్రాంతంగా విద్యార్జనలోనూ, విద్యా సంస్థలు నెలకొల్పడంలోనూ ముందున్న ఖమ్మం జిల్లాలో విశ్వ విద్యాలయాన్ని నెలకొల్పాలని అనేక ఆందోళనలు జరిగాయి. మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక కూడా అనేక విజ్ఞప్తులు అందజేయడం జరిగింది. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఒక విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నాం. భూ హక్కులకు సంబంధించి గత ప్రభుత్వం ధరణి పథకాన్ని తీసుకు వచ్చింది. ఖమ్మం జిల్లాలో అనేక మంది రైతులు ధరణి పథకం ద్వారా తమ భూములు రికార్డులోకి నమోదు కాక పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికీ వేల ఎకరాలు రికార్డుల్లో నమోదు కాలేదు. తమరి ప్రభుత్వం ధరణి స్థానే భూ భారతిని తీసుకు వచ్చింది. భూ భారతిలో ప్రతి భూ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఖమ్మం జిల్లా ఆంధ్రప్రదేశ్ సరిహద్దునే ఉన్నప్పటికీ ఇటీవల వరకు భూ క్రయ, విక్రయాలు సాదా బైనామాల ద్వారానే జరిగేవి. ఇప్పటికీ ఈ సమస్య తీవ్రంగానే ఉంది. భూ భారతి ద్వారా సాదాబైనామాల సమస్య పరిష్కరించి భూ హక్కులు కల్పించాల్సిందిగా కోరుతున్నాం. సర్వే నెంబర్లలో తప్పులు, హక్కు ఒక చోట సాగు మరో చోట కలిగిన అనేక సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతున్నాం. ఖమ్మంజిల్లాలో పోరు సమస్య కూడా పలు మండలాల్లో ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ పరిధిలోని అనగా 1/70 పరిధిలోని గిరిజన, గిరిజనేతరులకు ఇబ్బందులు కలగని రీతిలో సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివాస స్థలాల సమస్య ప్రధానంగా ఉంది. హైదరాబాద్ నగరం తర్వాత ఖమ్మం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించిన నేపథ్యంలో నివాస స్థలాలకు విపరీతమైన ధరలు పెరగడంతో పేదలు నివాస స్థలాలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం నివాస స్థలాల పంపిణీపై దృష్టి సారించని విషయం మీకు విధితమే. అర్హులైన పేదలను గుర్తించి నివాస స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాం. ఉద్యోగ, ఉపాధి రంగాలపైన దృష్టి సారించాల్సి ఉంది. వీటితో పాటు అక్షరాస్యత ఎక్కువగా ఉండి ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్న ఖమ్మం జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కారంతో పాటు పింఛన్‌దారులకు సంబంధించి బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. రైతు ఆశీర్వాద సభ తర్వాత ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు మారిన వాతావరణ పరిస్థితులు ఎలినినో ప్రభావం నేపథ్యంలో తక్కువ నీటి ఖర్చుతో లాభసాటి పంటల వైపు రైతాంగం మళ్లేలా నిరంతర అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాం.

ఇట్లు
ఖమ్మం జిల్లా ప్రజలు

# రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం



**-నేడు రైతుల ఖాతాల్లోకి మరో రూ.1900 కోట్లు**
**-డిప్యూటీ సీఎం భట్టి**

ప్రజాపక్షం/చింతకాని : రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం చింతకాని మండలం లచ్చగూడెం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భట్టి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వవ్యస్థకు వెన్నుముక గా నిలిచే రైతాంగానికి పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయాన్ని పండుగ చేయడమే తమ ఆశయమని ఆయన ప్రకటించారు. జగన్నాధపురంలో శుక్రవారం నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ రాష్ట్ర రైతాంగానికి పండుగ వాతావరణాన్ని తీసుకువస్తుందన్నారు.సభలో సీఎం రేవంత్‌రెడ్డితో క్యాబినెట్ మంత్రులు పాల్గొని రైతు భరోసాగా చివరి విడతగా రూ.1900 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నటుల వెల్లడించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి

మిగతా 2లో..

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**-రైతు ఆశీర్వాద సభ చారిత్రక సభగా నిలుస్తుంది..**

**-రైతు మేళా ప్రారంభోత్సవ సభలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి తుమ్మల**




ప్రజాపక్షం/చింతకాని : రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం రైతుల నుద్దేశించి భట్టి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం

మిగతా 2లో..

# అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలి



**- ఆ వైపుగా ఆలోచనలు మొదలయ్యాయి..**
**- కమ్యూనిజం పట్ల ఆకర్షితులవుతున్నారు..**
**- బలమైన ఉద్యమాలకు కార్యాచరణ**
**- విలేకరుల సమావేశంలో కూనంనేని**

ప్రజాపక్షం/భద్రాచలం : దేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని, దీనిపై మావోయిస్టు పార్టీ కూడా ఆలోచన చేస్తోందని, ఆ దిశగా బలమైన అడుగులు పడే అవకాశం ఉందని, అదే జరిగితే భవిష్యత్ కమ్యూనిస్టులదే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక రెడ్డి సత్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతా కమ్యూనిస్టుల వైపు

మిగతా 2లో..

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం





మన ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ కట్టుబడిఉందన్నారు. ఎమ్ఎస్‌పీ కింద రైతుల నుంచి మద్దతు ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణానే అన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతు ఆశీర్వాద సభ తెలంగాణ చరిత్రలో చారిత్రక సభగా నిలుస్తుందన్నారు. తొమ్మిది రోజుల్లో రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు జమచేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఎలినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నాయని రైతులు ఆరుతడి పంటలు వేయాలన్నారు. గోదావరి జలాలతో వైరా ప్రాజెక్ట్ నింపుతామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందకు యావత్ తెలంగాణ రైతాంగం కదలి వచ్చి ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. అనంతరం వ్యవసాయ అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఆసక్తిగా తిలకించారు. ఈ ప్రదర్శనలో వివిసి వారు ఏర్పాటు చేసిన వరినాటే యంత్రం, విద్యుత్ శాఖ , సహకార సంఘం , ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివకర టిఎస్, సీపీ సునిల్‌దత్, వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**(మొదటిపేజీ తరువాయి)**

చేతల్లో చూపిస్తుందే తప్ప మాటల్లో కాదన్నారు. రైతుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వారి ఆదాయం పెంచడం , వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ఉందన్నారు.రైతుల గురించి, వారి సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత ప్రతిపక్ష పార్టీలకు లేదని ఆయన అన్నారు. ప్రజాప్రభుత్వం రైతులకు ఏమి చేసిందో లెక్కలతో సహా సమాధానాలు చెప్పటానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ప్రజాప్రభుత్వానికి మాటలు చెప్పి బతికే అవసరం లేదని అన్నారు. మాది చేతల ప్రభుత్వం కాబట్టే నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్ట్ నుంచి నీళ్లు పారుతున్నాయన్నారు. మాయ మాటలతో అధికారంలోకి పదేళ్ళ పాలనలో కట్టిన కాళేశ్వరం ఒక్కటే నని అది ఇప్పుడు ఎలా ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలున్నారు. దశాబ్దాల కిందట కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా రైతులకు నీళ్ళు అందిస్తున్నాయన్నారు. పూర్తిగా వ్యవసాయం పై ఆధార పడిన

# రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం

**(మొదటిపేజీ తరువాయి)** వ్యవసాయం అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉదాహరణగా రైతు భరోసా గత పదేళ్ల బారాస పాలనలో రే.72వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో రూ. 36వేల కోట్లు రైతు భరోసా ఇచ్చిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1.67 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతు భరోసా కింద కేవలం 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతు భరోసా ఇచ్చిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వ మన్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయానికి కేంద్ర బిందువుగా నిలించిందని అన్నారు. రైతు కుటుంబం బలోపేతం కావాలంటే వ్యవసాయ రంగం బలోపేతం కావాల్సిందేనన్న స్పష్టమైన అవగాహనతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతుల కోరిక మేరకే ఈ కార్యక్రమానికి రైతు ఆశీర్వాద సభ అని నామకరణం చేశామని అన్నారు. రైతుల సంక్షమానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వానకి అండగా నిలవాలని, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పెద్ద సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఆత్మకమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు, లచ్చగూడెం సర్పంచ్ కొప్పుల రజని పాల్గొన్నారు.

## అన్నం శ్రీనివాసరావుకు సన్మానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సామాజిక వేత్త అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ను గురువారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలిచిన అన్నం శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం అన్నారు. ఎందరికో స్ఫూర్తిదాయకం అన్నారు. కరోనా సమయంలో ఆయన అనేక మంది ప్రాణాలను కాపాడరని పేర్కోన్నారు. కుటుంబ సభ్యులు కూడ భయపడి దగ్గరకు వెళ్లిన సందర్భంలో కూడ ఆయన చేసిన సేవలు ప్రశంసనీయం అన్నారు. ఎన్నో అవార్డులు పొంది సమాజం లో సేవలకు ఆదర్శంగా నిలిచారని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ మండల అధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు జెర్రిపోతుల సత్యనారాయణ, కట్టెకోల చిన్నికృష్ణ, ఉసిరికాయల శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, మాగి చక్రపాణి, పోన్నగాని శ్రీనివాసరావు, కడియాల నరేష్ పాల్గొన్నారు.



# అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలి

**(మొదటిపేజీ తరువాయి)** చూస్తున్నారని, విద్యార్థులు, యువకులు కమ్యూనిస్టు పార్టీలు ఉండాలని కోరుకుంటున్నారని చెప్పారు. ప్యారీస్‌లో మేయర్‌గా కమ్యూనిస్టు గెలిచాడని, న్యూయార్క్‌లో కూడా కమ్యూనిస్టు మేయర్ గెలిచాడని, కొత్తగూడెంలో కూడా మేయర్ కమ్యూనిస్టే అని చెప్పారు. దీనినిబట్టి సూచ్తే రోజురోజుకీ కమ్యూనిస్టుల పట్ల ఆదరణ పెరుగుతోందని, పేదలు, కార్మికులు, కర్షకుల తరుపున నిలబడి పోరాటాలు చేసేది కమ్యూనిస్టు పార్టీలే అని చెప్పారు. బిజేపి అధికారం ఉండటంతో ఇష్టానుసారంగా చేస్తోందని, 400లకు పైగా స్థానాల్లో మొన్నటి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నించినప్పటికీ భంగపాటు తప్పలేదని, అయినా రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టి, వైశమ్యాలు పెంచి అధికారం కోసం వెంపర్లాడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి పరిపాలన కొనసాగడం కష్టమని, వారి పతనం మొదలైందని చెప్పారు. ఏ నాడులేని అసమానతలు దేశంలోకి చొరబడ్డాయని, మతం పేరుతో మనుగడ సాగించేందుకు ప్రయత్నిస్తున్న ఆ పార్టీకి ప్రజల నుండి వ్యతిరేఖ పవనాలు మొదలయ్యాయని చెప్పారు. అయోధ్య రామ మందిర నిర్మాణం విషయంలో లక్షల కోట్ల డబ్బులు, క్వింటాళ్ల కొద్దీ బంగారం, వెండి పోగుసుకుని దోచుకున్నారని మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ ధన దాహమే తప్ప రాముని మీద ప్రేమ కాదని, అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తుండటం చూస్తుంటే అవినీతికి సహకరించిన వారు ఎవరో అర్ధమవుతోందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బిజేపి కార్మికులు, రైతులు, కర్షకులకు వ్యతిరేకమైన విధానాలు అవలంభిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనలో కొంత తడబాటు పడుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చతికల పడుతోందని, వాటి అమలుకు గత పాలకుల అప్పులు గుదిబండగా మారాయని చెప్పారు. బిఆర్ఎస్ వాళ్లు చేసిన తప్పులు వారికి తెలుసు కాబట్టి దాని ఆధారంగా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారు. ఆ ఆరోపణలను సరిచేసుకుని పూర్తి స్థాయిలో ముందుకు సాగాలని అన్నారు. కమ్యూనిస్టులుగా తమ కార్యకర్తలు, నాయకుల్లో రాజకీయ చైతన్యాన్ని నింపి బలమైన ప్రజా ఉద్యమాలు చేసేందుకు నిర్ణయించామని,ఇందులో భాగంగా ప్రతీ వేదవాడికి భూమి, ప్రతీ గుడిసెకు పట్టా అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు, సబ్బండ వర్గాల సమస్యలపై, మెడికల్ కుంభకోణాలపై, కార్పోరేట్ దోపిడీపై పోరాటాలకు సిద్దమవుతున్నామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టుల ప్రభావంగా బలంగా ఉండేలా, మరిన్ని అసెంబ్లీ స్థానాలు గెలిచే విధంగా రూపకల్పన చేసుకుని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

## పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మేజర్ పంచాయతీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి కోరారు. మేజర్ పంచాయతీ లోని 13వ వార్డు లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్ల కు గురువారం సర్పంచ్ శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. మేజర్ పంచాయతీ లో అన్ని వార్డుల ను దశల వారీగా అభివృద్ధి చేసేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మేజర్ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. పంచాయతీ పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు కొడిరెక్క వినోద్, మన్నె సుప్రజ, వాసు, మాజీ సర్పంచ్ లు రాయపూడి నవీన్, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, పుసుపులేటి ఉపేందర్, లక్కం ఏడుకొండలు, కొడిరెక్క శ్రీకాంత్, నూకల నరేష్, నాగార్జున, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్ దృశ్యాలు












### తొమ్మిది నెలల గర్భంతో ఉన్న

# ఆవును చంపిన దుండగులు

**-కన్నీరు మున్నీరైన యజమాని**

**-పోలీసులకు ఫిర్యాదు, గ్రామంలో పంచాయతీకి యత్నాలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండలంలోని సత్తెంపేట గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఓ రైతు ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న, 9 నెలల గర్భంతో ఉన్న ఒంగోలు జాతి ఆవును కొందరు దుండగులు మాంసం కోసం దారుణంగా చంపారు. గ్రామానికి చెందిన రైతు జగన్నాధరావు తన ఆవును కంటికి రెప్పలా చూసుకుంటూ పెంచుతున్నాడు. ప్రసవానికి సిద్ధంగా ఉన్న ఆవు గురువారం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి చుట్టుపక్కల వెతికాడు. గ్రామ శివారులో ఆవు మొండెం కనిపించడంతో యజమాని కన్నీరుమున్నీరయ్యాడు. స్థానికుల సమాచారం ప్రకారం, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సమీపంలోని కొమ్ముగూడానికి చెందిన మరో నలుగురితో కలిసి ఆవును గ్రామ శివారుకు తీసుకెళ్లి వధ చేసి, మాంసాన్ని విక్రయించినట్లు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై జగన్నాధరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని ఆయన కోరాడు. ఇదిలా ఉండగా, ఘటనపై గ్రామ పెద్దలు పంచాయతీ నిర్వహించి బాధ్యుల నుంచి నష్ట పరిహారం ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారంపై పోలీసుల దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.





# పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

## -ఉద్యమాలతో సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుండడంతో పెన్షనర్లు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. ప్రభుత్వం ఇదే రీతిగా కొనసాగితే ఆందోళనలు చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. గురువారం ఎస్‌జిపిఏటి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించలేదన్నారు. ఇప్పటికే పలువురు పెన్షనర్ల బకాయి కోసం ఎదురు చూసి ప్రాణాలను కోల్పోయారన్నారు. ఐదు విడతలుగా డిఏ మంజూరు కాక పెన్షనర్లు పలు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని దేశంలోనే అత్యధిక డిఏ బకాయిలు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిపోయిందని పుల్లయ్య తెలిపారు. పిఆర్‌సి గడువు తీరి మూడేళ్లు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. పెన్షనర్లు, ఉద్యోగుల వేతనాల నుండి రెండు నెలల ప్రీమియం మినహాయించిన ఇంత వరకు హెల్త్ కార్డులు ఇవ్వలేదని దీనితో నగదు రహిత వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం స్పందించని నేపథ్యంలో ఆందోళన బాట పట్టాలని పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన నాగిరెడ్డి, భాస్కర్‌రావు లకు సంఘం తరుపున జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, సహాయ కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, సంఘం నాయకులు కొలికొండ శరత్, బి. వెంకటేశ్వర్లు, కె. శ్యాంసుందర్ శర్మ, బోజడ్ల కృష్ణకుమారి, తాడి అంజలి, లక్ష్మి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## - కౌన్సిలర్ దండి రంగారావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అప్పారావు ప్రాథమిక చికిత్స కేంద్రం ద్వారా ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించాలని 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు సూచించారు. ఈ మేరకు గురువారం తన వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చికిత్స కేంద్రాన్ని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆరోగ్యమే మహాభాగ్యమని,ప్రతి పేదకుటుంబానికి సకాలంలో వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. ప్రజలు దేవుడి తర్వాత వైద్యులనే నమ్ముతారని, దేవుడు జన్మనిస్తే వైద్యులు తమ సేవలతోప్రాణాలను కాపాడి పునర్జన్మ ప్రసాదిస్తారనిపేర్కొన్నారు. అందుకే వైద్య వృత్తిని సేవాభావంతో కొనసాగిస్తూ, పేదలకు నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ ప్రాథమిక చికిత్స కేంద్రం ద్వారా 28వ వార్డు ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత చేరువవుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులను ఆదుకోండి

## - మంత్రి తుమ్మలను కోరిన తాటి



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** పెద్దవాగు ప్రాజెక్టు గండిపడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయకట్టు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్టు దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు వరుసగా మూడు పంటల సీజన్లుగా తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి పెద్ద వాగు ప్రాజెక్టు మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పెద్ద వాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ఇబ్బందులు నేరుగా వివరించినట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఘనంగా చెరుకూరి కిరణ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణ కాంగ్రేస్ యువ నాయకుడు మంత్రి సీతక్క అనుచరుడు చెరుకూరి కిరణ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను వైరా మండలం గొల్లపూడి వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు చిన్నారుల మధ్య మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కిరణ్‌కుమార్ మంత్రి సీతక్కతో అధికారం లేనప్పుడు కూడా తన సొంత అక్కలా భావించి నా ప్రయాణం మా అక్కతోనే మా అక్క నాకు సర్వస్వ అనే విధంగా వైరా మండలంలో ప్రతిఒక్కరితో చెప్పేవాడు అలాంటి మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు వృద్ధాశ్రమంలో జరపడం అభినందనీయమని నిండు నూరేళ్లు ఆమె ఆరోగ్యంగా ఉండి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు ఏదునూరు సీతారాములు, వీరంశెట్టి సీతారాములు, పొదిల హరినాథ్, పెద్దప్రోలు లక్ష్మయ్య, మల్లు రామకృష్ణ, పాలేటి నర్సింహారావు, అడుసుమల్లి గణేష్, పోలూరి సైదులు తదితరులు పాల్గొని ఘనంగా సీతక్క జన్మదిన కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సీతక్క ఆయురారోగ్య అష్టైశ్వార్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ముమ్ముందు మరెన్నో ఉన్నత పదవులు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలో గురువారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తల్లంపాడు గ్రామానికి చెందిన షేక్ మోసిన్(17), షేక్ జహీర్ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై ఇంటి వద్ద నుంచి ఖమ్మం వస్తున్నారు. మార్గం మధ్యలోని పొన్నెకల్లు స్టేజీ సమీపం దాటగానే వాహనం అదుపుతప్పింది. దీంతో మోసిన్ అక్కడికక్కడే మృతి చెందగా జహీర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అలాగే కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు తెలిపారు.

# రాజ్యసభలో బిఆర్ఎస్ పక్షనేతగా వద్దిరాజు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి పక్ష నేతగా వద్దిరాజు రవిచంద్ర ఎన్నికయ్యారు. కెఆర్ సురేష్‌రెడ్డి స్థానంలో వద్దిరాజు రవిచంద్రను నియమిస్తూ బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు లేఖ అందజేశారు. వద్దిరాజు రాజ్యసభకు ఎన్నిక కావడం ఇది రెండవ సారి. పారిశ్రామికవేత్తగా పేరుగడించిన వద్దిరాజు బిఆర్ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో చురుకైన నాయకునిగా గుర్తింపు పొందారు. ప్రజా సమస్యలను పార్లమెంటు వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవడంతో పాటు తనదైన పద్ధతిలో పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వద్దిరాజు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శాసన మండలి సభ్యులు తాతా మధు సూదన్ మాట్లాడుతూ వద్దిరాజు నియామకం ఖమ్మం జిల్లాలోని బిఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు పలువురు మాజీ శాసన సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు వద్దిరాజు అభినందనలు తెలిపారు.

# ఘనంగా మంత్రి సీతక్క పుట్టిన రోజు వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పుట్టిన రోజు వేడుకలు ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఖమ్మం కాల్వొడ్డులో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చెరుకూరి కిరణ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం, గిరిజనుల అభివృద్ధి కోసం సీతక్క చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజాసేవలో సీతక్క నిండు నూరేళ్లు గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కాంగ్రెస్ నాయకులు ఎదునూరి సీతారాములు, హరినాథ్, నర్సింహారావు, మల్లు రామకృష్ణ, గణేష్, లక్ష్మయ్య, సైదులు, సాయి పాల్గొన్నారు. మంత్రి సీతక్క పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# బోధకాల వ్యాధి రహిత సమాజం నిర్మిద్దాం



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీః** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు ఆదేశాల మేరకు గురువారం జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మధిర మండల పిహెచ్‌సి దెందుకూరు పరిధిలో డాక్టర్ పృధ్విరాజ్ నాయక్ మధిర లడకబజార్‌లో ఏర్పాటు చేసిన బోధకాల వైద్య నిర్ధారణ, అనుమానిత లక్షణాలు నిరాధరణ చేయుటకు ఉన్న జనాభాలో కొంతమందికి రక్త నమూనాలు సేకరించి నిర్ధారణ జరిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ శిరీషా, డిఎంవో వెంకటేశ్వర్లు(సీనియర్ ఏంటమాలజిస్ట్), క్యాంపును బాబుసాహెబ్ రోడ్డులో గురువారం జరుగుతుండగా వారు తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించడం జరిగిది. ఈ కార్యక్రమంలో వారి వెంట డాక్టర్స్ పృధ్విరాజ్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో గోవింద్, హెచ్‌ఎస్ కోట వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ గుర్రం శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం లక్ష్మి సావిత్రి, హెచ్‌వి సరోజిని దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిఏఎస్1 పైలేరియా స్క్రీనింగ్ విజయవంతం



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీః** మధిర పట్టణంలో బాబుసాహెబ్ రోడ్డులో టిఏఎస్1 పైలేరియా స్క్రీనింగ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డిఎంహెచ్‌వో) ఆదేశబూల మేరకు గురువారం పిహెచ్‌సి దెందుకూరు ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని బాబుసాహెబ్ రోడ్డు ప్రాంతంలో టిఏఎస్1 పైలేరియా స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబుసాహెబ్ రోడ్డు పరిధిలో పిహెచ్‌సి దెందుకూరుకు కేటాయించిన అన్ని గృహాలను సందర్శించి అర్హులైన వారందరికి పైలేరియా స్క్రీనింగ్ పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, జిల్లా మలేరియా అధికారి(డిఎంవో) వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని సందర్శించి సిబ్బందికి అవసరమైన సూచనలు అందజేశారు. ఈ సర్వే కార్యక్రమంలో డాక్టర్ పృధ్వీరాజ్ ఆధ్వర్యంలోని పిహెచ్‌సి దెందుకూరు వైద్య బృందం చురుకుగా పాల్గొని ఇంటింటికి వెళ్లి పైలేరియా స్క్రీనింగ్ నిర్వహించింది. ప్రజలందరూ ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించి పైలేరియా నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యశాఖ విజ్ఞప్తి చేస్తుంది.

# రైతు ఆశీర్వాద సభకు భారీగా తరలిరావాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నేడు చింతపల్లి మండలం జగన్నాథపురం వద్ద మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్న రైతు ఆశీర్వద సభను విజయవంతం చేయాలని మంత్రిపొంగులేటి క్యాంప్‌కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక సభకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ వాకిటి శ్రీహరితో పాటు మన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. కావున మంత్రి పొంగులేటి సూచనల మేరకు పాలేరుపరిధిలోని ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలు, ఏదులాపురంమున్సిపాలిటీ ప్రజాప్రతనిధులు, నాయకులు గ్రామస్థాయిలో సమన్వయం చేసుకొని ప్రజలను, రైతులను భారీ సంఖ్యలో సభావేదికకు తరలించి సభను జయప్రదం చేయాలన్నారు.

## రైతు ఆశీర్వాద సభ పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** నేడు చింతకాని మండలం జగన్నాధపురం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు ఆశీర్వాద బహిరంగ సభ వాల్ పోస్టర్లను కాంగ్రెస్ మడంల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు గిద్దవారిగూడెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, శాసన సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందిస్తోందని పేర్కొన్నారు. మండల ప్రజలు, రైతులు భారీ సంఖ్యలో హాజరై ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకుడు గుగులోత్ బీముడు నాయక్, గిద్దవారిగూడెం సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో మనీషాలక్ష్మీ పర్యటన



**ప్రజాపక్షం/కారేపల్లి:** బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్‌లాల్ సింగరేణి మండలంలో విస్తృతంగా పర్యటించి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం, ప్రమాదాలు, కుటుంబ విషాదాలను ఎదుర్కొన్న బాధితులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈసందర్భంగా మాదారం గ్రామ ఉప సర్పంచ్ బానోత్ లాలు, పేరుపల్లి గ్రామానికి చెందిన బుడిగ శ్రీను, పాత కమలాపురం మాజీ సర్పంచ్ తేజవత్ బాబురావు కుటుంబ సభ్యులు, భూక్య జీవన్ కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈ పర్యటనలో మాజీ జెడ్‌పిటిసి జగన్, మాజీ దిశ కమిటీ సభ్యులు లకావత్ లక్ష్మణ్, దొంకెన రవీందర్, పేరుని వెంకటేశ్వర్లు, యువజన నాయకులు జడల కళ్యాణ్, రామారావు, హరీష్, గంగారబోయిన మురళి, పిల్లలమర్రి వెంకటేష్, మధు, పెద్దబోయిన సురేష్, సంపత్, తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈశ్వరమాధవరంలో ఆధ్యాత్మిక మహోత్సవం

### -ఆలయ అభివృద్ధికి కందాళ ఉపేందర్‌రెడ్డి రూ 10లక్షల విరాళం



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం ఈశ్వరమాధవరం గ్రామంలో నిర్వహించిన శ్రీరామ లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, గంగమ్మ తల్లి, అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి తన సతీమణితో కలిసి ఉత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ 10లక్షల విరాళాన్ని ప్రకటించి అందజేశారు. గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక సేవలో భాగంగా ఈసహాయం చేసిన కందాళ ఉపేందర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెనగడప పీహెచ్‌సీ, దన్‌బాద్-2 ఆరోగ్య కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయానికి చెందిన ప్రజారోగ్య నిపుణుడు డా. వరుణ్ గైకి గురువారం చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దన్‌బాద్2 ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హరీష్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. పిహెచ్‌సీలో నిర్వహిస్తున్న వివిధ విభాగాలను పరిశీలించిన డా. వరుణ్ విజయ్ గైకి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, ఫార్మసీ స్టోర నిర్వహణ, ఐఎల్ఆర్ (ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్) పనితీరు, టీకాల నిల్వ విధానం, రోగుల రిజిస్టర్లు, వైద్య రికార్డులు, ఇతర పరిపాలనా పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే దన్‌బాద్2 ఆరోగ్య కేంద్రంలో కూడా సేవల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ఔషదాల నిల్వ, పరిశుభ్రత, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని రికార్డులను ఎప్పటికప్పుడుడ నవీకరించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన, సమయానుకూల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించడం, టీకాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను పాటించడం, మందుల నిల్వలో జాగ్రత్తలు తీసుకోవడం, రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. అధికారులు సూచించిన అంశాలను అమలు చేసి ఆరోగ్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని వైద్యాధికారి డాక్టర్ హరీష్ తెలిపారు.

# వర్షాకాలంలో అధిక దిగుబడినిచ్చే పండ్ల సాగు..!

### - రైతులకు వ్యవసాయ నిపుణులు





**ప్రజాపక్షం/తల్లాడ:** వ్యవసాయంలో అధిక లాభాలు సాటదించాలంటే సీజన్‌కు అనుగుణంగా పండ్ల తోటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నేలలో తగినంత తేమ ఉండటంతో పండ్ల మొక్కలు బాగా పెరిగి మంచి దిగుబడిని అందిస్తాయని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పండ్లకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులు సాంప్రధాయ పంటలతో పాటు పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. జామ, బొప్పాయి, అరటి, నేరేడు, బత్తాయి, డ్రాగన్‌ఫ్రూట్ వంటి పంటలు రైతులకు అధిక ఆదాయాన్ని అందించే అవకాశం ఉందని నిపుణులు తెలుపుతున్నారు. జామ తక్కువ పెట్టుబడితో ఏడాదికి పలుమార్లు కాపు వచ్చే అవకాశం ఉందని, మంచి నాణ్యతమైన మొక్కలను మాత్రమే నాటాలని సూచించారు. బొప్పాయి పంట కేవలం 8 నుంచి 10మాసాల్లోనే దిగుబడి ఇవ్వడం రైతులకు లాభదాయకమని, అరటి పంటకు సంవత్సరమంతా మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని అధికారులు సైతం అంటున్నారు. డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు ప్రారంభ పెట్టుబడి ఎక్కువైనా..దీర్ఘకాలంలో మంచి లాభాలు వస్తాయని, బత్తాయి తోటలు కూడా దీర్ఘకాలిక ఆదాయాన్ని అందిస్తాయని చెబుతున్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటడానికి అనుకూల సమయమని, గుంతలు ముందుగానే సిద్ధం చేసుకొని, పశువుల ఎరువును గుంతల్లో వేయాలని సూచించారు. వ్యాధి నిరోధక రకాల మొక్కలు ధృవీకరించిన నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని, మొక్కల మధ్య తగినంత దూరం పాటించాలని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కలుపు మొక్కలనుయ ఎప్పటికప్పుడు తొలగించాలని, మల్చింగ్ పద్ధతిని పాటిస్తే నేల తేమ ఎక్కువకాలం నిలుస్తుందని, సూక్ష్మ పోషకాలను అవసరమైనప్పుడు మాత్రమే అందించాలని సూచిస్తున్నారు. పురుగు తెగళ్లను ప్రారంబ దశలోనే గుర్తించాలని, సమగ్ర పురుగు నివారణ పదుదతులను అనుసరించాలని చెబుతున్నారు. మట్టి పరీక్షలు చేయించి, ఎరువుల మోతాదును నిర్ణయించాలని పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా నీటిని ఆదా చేయొచ్చని వివరించారు. అధిక వర్షాల సమయంలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నైపుణ్యమైన పనులు ఉత్పత్తి ద్వారా రైతులు మంచి ధర పొందొచ్చని, పండ్లను సరైన దశలో కొయ్యాలని సూచించారు. రైతు ఉత్పత్తి ధరలు సంఘాల ద్వారా విక్రయాలు చేపడితే మంచి ధర లభిస్తుందని వివరించారు. ఉద్యానశాఖ అందించే సబ్సిడీల గురించి రైతులు తెలుసుకోవాలని తోటలు నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలల్లో పాల్గొనాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టాలని, ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పండ్లు సాగును ప్రోత్సహించాలని, దీనివల్ల ప్రమాదాలను తగ్గించుకోవచ్చని వివరించారు. మార్కెట్ డిమాండ్‌ను ముందుగానే అంచనావేసి సాగు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఆధునికసాగు పద్ధతులను అనుసరిస్తే దిగుబడి పెరుగు తుందని తెలిపారు. సరైన ప్రణాళిక నైపుణ్యమైన మొక్కలు, శాస్త్రీయ సాగు పద్ధతిలో రైతులు అధిక దిగుబడితోపాటు మంచి ఆదాయాన్ని పొందగలరని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. 'సీజన్‌కు తగిన పండ్ల సాగురైతు ఆదాయానికి బంగారు బాట' అంటూ వ్యవసాయ నిపుణులు రైతులకు పిలుపునిచ్చారు.

# నిర్లక్ష్యం@నిండు ప్రాణం..!

### -హెల్మెట్ పెట్టుకుందాం... ప్రాణాన్ని కాపాడుకుందాం


(ఫైల్)


(ఫైల్)


(ఫైల్)

**ప్రజాపక్షం/వైరా:** రోడ్డు ప్రమాదాలు కేవలం కొన్ని క్షణాల వ్యవధిలోనే జరుగుతూ జీవితాలను తలకిందులు చేస్తుంది. రోడ్డు ప్రమాదాల గణాంకాలు హెల్మెట్ వినియోగం ఎంత అవసరమో స్పష్టం చెబుతున్నాయి. ప్రతిరోజు పోలీసులు ఆర్‌టివో అధికారులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినప్పటికీ చాలామంది హెల్మెట్ వాడటంతో నిర్లక్ష్యం చేస్తున్నారు. కొంతమంది హెల్మెట్‌ను చలానాల నుంచి తప్పించుకునే విధంగా భావిస్తూ వాడుతున్నారు. ప్రతి ప్రాణం విలువైంది. దానిని కాపాడుకోవాలని సందేశంతో హెల్మెట్ వినియోగంపై అధికారులు హెచ్చరికలు కూడా చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో జరుగుతున్న ద్విచక్ర వాహనదారుల మరణాలకు ప్రధానం హెల్మెట్ ధరించకపోవడం, హెల్మెట్ నాకెందుకు అనే ఒక చిన్న నిర్లక్ష్యం ఒక కుటుంబాన్ని కన్నీటిలో జీవితాంతం ముంచేస్తుంది. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఎంతగా హెల్మెట్ ప్రాధాన్యత గురించి చెబుతున్న దానిపై పట్టింపు లేకుండా ఉండటమే ప్రమాదాలకు కారణం. ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ, ఎలా సంభవిస్తుందో ఎవరూ చెప్పలేరు. అలాంటి సమయంలో ప్రాణాలను కాపాడేది హెల్మెట్ మాత్రమే మోటారు వాహనాల చట్టం లోని సెక్షన్ 129 ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి. అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చలానాలు విధిస్తున్నారు. హెల్మెట్ ధరించని వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**హెల్మెట్ ప్రాణ భద్రత కోసం ధరించాలి...**

ప్రతి వాహనదారుడు ద్విచక్ర వాహనంతో వెళ్లేటప్పుడు హెల్మెట్‌ను ఒక బాధ్యతగా ప్రాణ భద్రతగా ఉపయోగించాలి. కాని హెల్మెట్ లేకపోతే చలానాలు వేస్తారు. పోలీసులు ఆపుతారు అని భయంతో మాత్రం ఉపయోగించవద్దు. మన కుటుంబ భద్రత మన ప్రాణాలను కాపాడేది హెల్మెట్ అని గుర్తించి బాధ్యతగా ధరించాలి.

**హెల్మెట్ ప్రాణాలకు రక్షణః ఏసిపి సారంగపాణి**



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా రోడ్లపై వాహనాలు నడిపితే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాలతో చెలగాటం ఆడటమే అన్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం చలానాలు విధిస్తాం. పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు వాహనం సీజ్ చేసే అవకాశం ఉంది. హెల్మెట్ ప్రాణాలకు రక్షణ కవచం హెల్మెట్ ధరించడం ప్రతి ద్విచక్ర వాహనదారుడి బాధ్యత. ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడే మొదటి రక్షణ హెల్మెట్ మాత్రమే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి స్ట్రాప్ సరిగా బిగించుకొని ప్రయాణించాలని తెలిపారు. చాలామంది పోలీసులు కనిపించినప్పుడు మాత్రమే హెల్మెట్ ధరించి వెంటనే తీసేస్తున్నారు. ఇంట్లో ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల కోసం, పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి ప్రయాణంలోను హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏసిపి సారంగపాణి తెలిపారు.

# రూ.4.70 కోట్ల సైబర్ మోసం

### -సత్తుపల్లి కేంద్రంగా మ్యూల్ ఖాతాల దందా
### -సత్తుపల్లికి చెందిన దోసపాటి అరెస్ట్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రూ.4.70 కోట్ల భారీ సైబర్ మోసం కేసు దర్యాప్తులో సత్తుపల్లి పేరు మరోసారి వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఛేదించిన ఈ కేసులో మ్యూల్ బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్‌కు సత్తుపల్లి కేంద్రంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలడం స్థానికంగా చర్చనీయాంశమైంది.సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం... హానర్ హోమ్స్ సంస్థ ఎండీ స్వప్నకుమార్ పేరుతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ సృష్టించిన సైబర్ నేరగాళ్లు సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌ను అంటూ నమ్మబలికి రెండు విడతల్లో రూ.4.70 కోట్లను వేర్వేరు బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించారు. అనంతరం అసలు ఎండీతో మాట్లాడిన తర్వాత మోసం జరిగిన విషయం బయటపడటంతో జూలై 2న ఫిర్యాదు నమోదైంది. దర్యాప్తులో తొలి విడతలో బదిలీ అయిన రూ.1.80 కోట్లు కొత్తపేటకు చెందిన మండవల్లి శివనాగరాజు పేరుతో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మొత్తాన్ని వెంటనే పలు ఖాతాలకు మళ్లించినట్లు విచారణలో తేలింది. తన బ్యాంకు ఖాతాను సైబర్ నేరగాళ్లకు వినియోగించేందుకు ఇచ్చినందుకు శివనాగరాజుకు రూ.4 లక్షల కమిషన్ అందినట్లు పోలీసులు తెలిపారు. శివనాగరాజు విచారణలో సత్తుపల్లికి చెందిన దోసపాటి కృష్ణసాయికి తన ఖాతాను అప్పగించినట్లు వెల్లడించడంతో అతడిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణసాయి సైబర్ నేరగాళ్లకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ మ్యూల్ బ్యాంకు ఖాతాలను సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు.

**రూ.600 కోట్ల పాత కేసులూ సత్తుపల్లి పేరు మళ్లీ..**

ఇదే తరహాలో గతంలో కూడా సత్తుపల్లి కేంద్రంగా దాదాపు రూ.600 కోట్లకు పైగా సైబర్ నిధులు మ్యూల్ ఖాతాల ద్వారా బదిలీ అయినట్లు దర్యాప్తులో వెలుగుచూసిన విషయం ఇప్పుడు మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల్లో నమోదైన సైబర్ మోసాలకు సంబంధించిన రూ.2.49 కోట్లు కూడా ఇదే నెట్‌వర్క్‌లోని ఖాతాల ద్వారా వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. ఇంకా హానర్ హోమ్స్ నుంచి బదిలీ అయిన మరో రూ.2.90 కోట్లకు ఉపయోగించిన బంధన్ బ్యాంకు ఖాతాపై దర్యాప్తు కొనసాగుతోందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడించింది.

**స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు...**

ఈ కేసు నేపథ్యంలో సత్తుపల్లిలోని వినాయక గ్రాండ్ హోటల్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న ఒక ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌పై కూడా కొందరు స్థానికులు పలు ఆరోపణలు చేస్తున్నట్లు సమాచారం. స్థానికుల ఆరోపణల ప్రకారం.. అక్కడ ప్రజల క్రెడిట్ కార్డు, బ్యాంకింగ్ వివరాలు దుర్వినియోగం అయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ ఆరోపణలు ప్రస్తుతం అధికారికంగా నిర్ధారించబడలేదు. సంబంధిత వ్యక్తిపై నమోదైన కేసులు లేదా దర్యాప్తు ఫలితాల ఆధారంగానే వాస్తవాలు తేలాల్సి ఉంది.

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు....**

సత్తుపల్లి కేంద్రంగా పదేపదే మ్యూల్ బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్ బయటపడుతున్నా, సంబంధిత శాఖలు ముందస్తు నిఘా ఎందుకు పెట్టలేకపోయాయి..?, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల కార్యకలాపాలపై పర్యవేక్షణ ఎంతవరకు జరుగుతోంది..?, అమాయక ప్రజల బ్యాంకింగ్ వివరాలు ఎలా దుర్వినియోగం అవుతున్నాయి...? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సైబర్ నేరాలపై పోలీసులు చర్యలు తీసుకోవడం మాత్రమే కాకుండా, మ్యూల్ ఖాతాలను సమకూర్చే మధ్యవర్తుల నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించి, ప్రజల వ్యక్తిగత బ్యాంకింగ్ సమాచారాన్ని అక్రమంగా సేకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికడీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తలు పెద్ద మొత్తాల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వాట్సాప్ లేదా ఇతర ఆన్‌లైన్ సందేశాలను నమ్మి నిధులు బదిలీ చేయకుండా, సంబంధిత వ్యక్తులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి ధృవీకరించిన తర్వాతే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు.

# ప్రభుత్వ సాంకేతికతకే సవాల్..!

### -ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై ఆరోపణలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫేస్ స్క్రీనింగ్ విధానాన్ని కొందరు సిబ్బంది దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు అన్నపురెడ్డిపల్లి మండలంలో వినిపిస్తున్నాయి. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన సాంకేతిక విధానాలే కొందరి చేతుల్లో బలహీనపడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు ఫేస్ స్క్రీనింగ్ వ్యవస్థను హ్యాక్ చేస్తున్నట్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీని వల్ల వాస్తవంగా పనులకు హాజరుకాని వారి పేర్లతో హాజరు నమోదు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పనుల నాణ్యత, కొలతలు, సాంకేతిక అంశాలను పర్యవేక్షించాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు కూడా ఈ లోపాలను గుర్తించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సమగ్ర నివేదికల్లో కనిపించాల్సిన వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, వాటిని ఉన్నతాధికారులు గుర్తించలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు సామాజిక తనిఖీల్లో కొందరు అధికారులు నిర్లక్ష్యం లేదా అక్రమాలు బయటపడినా, వాటిని కప్పిపుచ్చేందుకు సంబంధిత సిబ్బంది ప్రలోభాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. 5జీ సెల్‌ఫోన్‌లో ఒక్కసారి రెండో సిమిశాల విడిది గల సంబంధిత వ్యక్తి ఫేస్ వీడియోను తీయగలిగితే ఈ వ్యక్తి పనికి రాకపోయిన కూడా రోజు అదే వీడియోని వాడుతూ హాజరు వేసే విదంగా ఈ సాంకేతికతను ఫీల్డ్ అసిస్టెంట్లు దుర్వినియోగం చేసుస్తున్నారని మండలంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి ఆరోపణలను నిజం చేస్తూ సామాజిక తనిఖీలలో దొరికిపోయిన సిబ్బందిపై వేటుపడకుండా అధికారులను వివిధ ప్రలోభాలకు గురిచేస్తూ తప్పించుకుంటున్నారని కూడా గుసగుసలాడుతున్నారు. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాంకేతిక వ్యవస్థల లక్ష్యం పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడమే, అయితే వాటి అమలులో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్ది, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మణుగూరు మనుగడకు సింగరేణికి నూతన బొగ్గు గనులు కేటాయించాలి




**ప్రజాపక్షం/మణుగూరుః** సింగరేణి పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందుతున్న మణుగూరు పట్టణ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. పట్టణ మనుగడ, వేలాది కుటుంబాల జీవనోపాధి పూర్తిగా సింగరేణిపై ఆధారపడి ఉంది. అందుకే మణుగూరు ప్రాంత అభివృద్ధి, ఉపాధి అవకాశాల కొరకు సింగరేణికి వెంటనే నూతన బొగ్గు గనులను కేటాయించాలని స్థానిక ప్రజలు, కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. ఉపాధికే గ్యారెంటీ కావాలి మణుగూరు అంటేనే సింగరేణి. తాటాకు గుడిసెల నుండి నేటి ఆధునిక పట్టణంగా ఎదిగిన ఈ ప్రాంతానికి సింగరేణి గనులే ప్రాణం. ప్రస్తుతం ఉన్న గనుల్లో ఉత్పత్తి తగ్గడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు, అనుబంధ వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిలో కొత్త గనులు కేటాయించకపోతే మణుగూరు ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యే ప్రమాదం ఉంది. కొత్త గనుల కేటాయింపుతో ప్రత్యక్ష, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుంది. రవాణా, కాంట్రాక్టులు, చిన్న వ్యాపారాలు ఊపందుకుంటాయి. ఫలితంగా పట్టణ ఆదాయం, మౌలిక సదుపాయాలు కూడా పెరుగుతాయి.ప్రజల డిమాండ్ మా తాతలు, తండ్రులు సింగరేణిలో పనిచేసి ఈ పట్టణాన్ని నిర్మించారు. ఇప్పుడు మా పిల్లలకు కూడా ఇక్కడే బతుకు దొరకాలి. ప్రభుత్వం వెంటనే సింగరేణికి కొత్త గనులు కేటాయించి మణుగూరు మనుగడను కాపాడాలి అనేది ప్రతి ఒక్కరి నినాదంగా మారింది. 50 ఏళ్లుగా రాష్ట్ర ఆదాయానికి వెన్నుదన్నుగా నిలిచిన మణుగూరును నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే గనులు కేటాయించి పట్టణానికి భరోసా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## సాయి సన్నిధిలో భక్తిశ్రద్ధలు

### -అన్నప్రసాద వితరణ చేపట్టిన వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయ రేణుక దంపతులు
### -సాయిబాబా రథానికి రూ 3.50లక్షల విరాళం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని సారపాకలోని శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారకా సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇరవెండి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, తాళ్లూరి ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయ రేణుక దంపతులు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు బాబా వారి ఊరేగింపునకు రూ 3.50లక్షల వ్యయంతో రథాన్ని అందించేందుకు ప్రవాస భారతీయులు, తానా మాజీ ఛైర్మన్ తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతులు ముందుకు రాగా, రథ నిర్మాణం కోసం రూ 2లక్షల ముందస్తు నగదునను వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయరేణుక దంపతులు ఆలయ కమిటీకి అందజేశారు. ఈసందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ సాయిబాబా సేవలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని, భక్తుల సౌకర్యార్థం రథ నిర్మాణానికి సహకరించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు ఆశీర్వాద సభకు తరలిరావాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు ఆశీర్వాద సభకు ప్రజలు తరలిరావాలని వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. గురువారం స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు విడుదల చేసే రుణమాఫీ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని అన్నారు. అదే విధంగా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో వైరా ఇంచార్జ్ రాంపొడి రోశయ్య, సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరామ్ నాయక్, మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు ప్రభావతిరెడ్డి, సామేలు, సర్పంచులు భూక్య లక్ష్మ, దానసరి నవీన్, అజ్మీర సురేష్, రామకోటి, ఇంజం శేషగిరిరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు లాలూ నాయక్, సక్రు నాయక్, నాయకులు మేడ ధర్మారావు, ముక్తి వెంకటేశ్వర్లు, గాలిబ్ సాహెబ్, గుర్రం రవి, పూర్ణకంటి మైసరావు, గోళ్ళ చిన్నస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసు నమోదుపై బార్ అసోసియేషన్ ఆగ్రహం



**ప్రజాపక్షం/దమ్మపేట:** సివిల్ వివాదంలో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకుని స్థానిక న్యాయవాది గోళ్ల భవాని కృష్ణ యాదవ్‌పై అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ దమ్మపేట బార్ అసోసియేషన్ నిరసనకు దిగింది. దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళి మోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు మీడియాతో మాట్లాడారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం సరికాదని, కనీస విచారణ లేకుండా కేసు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. న్యాయవాది భవాని కృష్ణ యాదవ్ పై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురు, శుక్రవారాల్లో కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముప్పిడి, సీనియర్ న్యాయవాదులు శ్యామ్ సుధాకర్, ఉడతనేని శ్రీనివాసరావు, మారం సతీష్‌కుమార్, కాలం సంధ్యారాణి, తామ బాలరాజు, నల్లపు ఉదయ్‌కుమార్, గద్దల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)సర్వేను తహసీల్దార్ అశోక్ కుమార్ గురువారం పరిశీలించారు. మండలంలోని సీతారాంపురం పోలింగ్ స్టేషన్ నంబర్ 125, నరసాపురం గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించి, బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ప్రజలు అందజేస్తున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే స్వీకరించాలని సూచించారు. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే ఓటు హక్కుకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటకరుగా నమోదు చేసుకోవాలని, ఎస్ఐఆర్ సర్వేలో ప్రజలు బాధ్యతగా పాల్గొని ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో రఘునాథపాలెం ముందుండాలి

**-సీతారామ ద్వారా సాగునీరు**
**-పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** అభివృద్ధిలో రఘునాథపాలెం మండలాన్ని ముందుంచుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఈర్లపుడి గ్రామంలో రూ. 20లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రఘునాథపాలెంను మొదటి స్థానంలో నిలపాలని మంత్రి తెలిపారు. మండలంలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు ఇటీవల మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి చెరువులను నింపినట్లు తెలిపారు. వచ్చే ఏడాది నాటికి సీతారామ ద్వారా గోదావరి జలాలను రఘునాథపాలెం మండలానికి తీసుకు వస్తామని తెలిపారు. బుగ్గవాగు నుంచి పైపులైన్ ద్వారా రఘునాథపాలెం మండలానికి సాగునీటిని తీసుకు వచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సాగర్ నీరు రాకపోయినా మండలంలో నీటి కష్టాలు లేకుండా సీతారామ, బుగ్గవాగు ద్వారా నీటిని అందిస్తామన్నారు. రైతులు నాణ్యమైన పంటలను పండించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలని తెలిపారు. ప్రస్తుతం ధర కూడా ఆశాజనకంగా ఉందని తెలిపారు. కొణిజర్ల మండలం ఆయిల్ పామ్ సాగు బాగుందని అదేవిధంగా రఘునాథపాలెం మండలంలో కూడా ఆయిల్ పామ్ సాగు పెరగాలన్నారు. రైతు భరోసా క్రింద తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసినట్లు తెలిపారు. చింతకాని మండలంలో శుక్రవారం జరిగే ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేలోత్ గీతాదేవ్ సింగ్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పనిచేసే వారికి గుర్తింపు

**-పార్టీ అభివృద్ధికి కృషి చేయండి**
**-దేవ్‌సింగ్ అభినందన సభలో మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పని చేసే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడి గ్రామంలో నూతనంగా కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా ఎన్నికైన కేలోత్ దేవ్‌సింగ్ అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్‌తో కలిసి నియామక పత్రాన్ని దేవ్‌సింగ్‌కు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవ్‌సింగ్ యువకుడు, పనిచేసే వ్యక్తి అన్నారు. దేవ్‌సింగ్ ఆధవర్యంలో మండలంలో పార్టీని మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులకు, నాయకులకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు గ్రామంలో నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన దేవ్‌సింగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ మండల అధ్యక్షునిగా నియమించినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సర్పంచ్ కేలోత్ గీత, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు, లాల్‌సింగ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా లయన్ వుండ్రు శ్యామ్‌బాబు పుట్టినరోజు వేడుకలు

**తోపుడు బండ్లు, కుట్టు మిషన్‌లు, విద్యార్థులకు స్టడీ కిట్లు, మహిళలకు చీరలు పంపిణీ**







**ప్రజాపక్షం/వైరాః** వైరాలో లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు జిల్లా జిఈటి కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు పుట్టినరోజు వేడుకలు లయన్స్ ఐ కేర్ హాస్పిటల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ముగ్గురికి తోపుడు బండ్లు, మహిళలకు రెండు ఉచిత కుట్టు మిషన్లు, 20వ వార్డులో ఉచిత వైద్యశిబిరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్, మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ మెడికల్ సెల్ అధ్యక్షులు లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ విచ్చేసి మాట్లాడుతూ శ్యామ్‌బాబు కృసి పట్టుదలతో ఎదిగి సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో గత 16 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్‌లో సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రతి మనిషి సేవా మార్గంలో నడిచి సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మనుషుల్లో చిరస్థాయిగా నిలిచే విధంగా పది మంది మంచి స్థానం సంపాదించాలని ఆయన పేర్కొన్నారు. మనకున్న మార్గాల ద్వారా పేదలను నిరుపేదలను ఆదుకోవడం మనందరి కర్తవ్యం అని తెలిపారు. శ్యామ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల వుండ్రు శ్యామ్‌బాబు వరలక్ష్మి దంపతులను అభినందించారు. అనంతరం శ్యామ్‌బాబు మాట్లాడుతూ మీ అందరి ఆశీస్సులతో ఆదరాభిమానాలతో నా బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మూడు లయన్స్‌క్లబ్‌లు 20 వార్డు మిత బృందం సభ్యులు కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్సిఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేంద్రరావు, జోన్ ఛైర్మన్ తోటకూర శ్రీకాంత్, రీజియన్ సెక్రటరీ వై.బుచ్చిరామారావు, క్లబ్ మహిళా కోఆర్డిటర్ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, 20వ వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి, లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు కొల్లా రాంబాబు, ఉయ్యూరు రామకృష్ణ, గద్దె నీరజ, సెక్రటరీ కొదుమూరు రవి, జాల మహాలక్ష్మి, సుగ్గల మాధవి, కోశాధికారి కొదుమూరి భాగ్యలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జాల పుల్లారావు, నూకల ప్రసాదరావు, ఏపూరి రాజారావు, కొమిరిశెట్టి శ్రీధర్, చింతలపూడి వెంకటేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, పువ్వాళ్ళ రాము, బీక్యా, గుమ్మడిదల వెంకటనారాయణ, గంగవరపు కిషన్‌రాయ్, లయన్స్ ఐ కేర్ హాస్పిటల్ సిబ్బంది, 20వ వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, మిత్ర బృందం పాల్గొన్నారు.

# ఆదర్శ స్వచ్ఛ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ దండి రంగారావు**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజల సహకారంతో ఏదులాపురం మున్సిపాలిటీలోనే 28వ వార్డును ఆదర్శస్వచ్ఛ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు తెలిపారు. గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రతికుటుంబంతమ ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటుంతో, అదే బాధ్యతతో కాలనీలు,వీధులు, పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. వార్డులో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇంతటి మంచి కార్యక్రమానికి ప్రజలు కూడా తమ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మల్టీపర్పస్ వర్కర్స్ పాల్గొన్నారు.

# అనుమతులు ఉన్నా దాడి చేశారు..

**-సామాన్లు తిరిగి ఇవ్వాలి**
**-విలేకరుల సమావేశంలో బాధితులు**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అన్ని అనుమతులు ఉన్నా మున్సిపల్ సిబ్బంది తమ ఇంటిపై దాడి చేసి తినుబండారాలు తయారు చేసే సామాన్లు తీసుకెళ్లారని బాధితులు రాము పెరుమాళ్, రాము సుధా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్న చిన్న తినుబండారాలు తయారు చేసి అమ్ముకుని బతుకుతున్న తమపై మున్సిపల్ సిబ్బంది, అధికారుల దాడులు పెరిగాయన్నారు. అన్ని అనుమతులు ఉన్నా తమను ఇబ్బందులు పెడుతున్నారని వారు వాపోయారు. తాము తయారు చేసే వంటల వల్ల పొగ వస్తుందని దీని వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ఇంటి పక్కన ఉన్న ఓ జర్నలిస్టు బెదిరిస్తూ దౌర్జన్యం చేశారన్నారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది తమ ఇంటికి వచ్చి వంట సామాన్లు తీసుకెళ్లారని అప్పుడు అధికారులను వేడుకుని తెచ్చుకున్నామని ఇప్పుడు మరల మున్సిపల్ సిబ్బంది వచ్చి సామాన్లు ఎత్తుకెళ్లారన్నారు. తాము ఇంట్లో లేకపోయినా గేటు తాళం పగలగొట్టి సామాన్లు ఎత్తుకెళ్లారన్నారు. తరచూ మున్సిపల్ సిబ్బంది దాడులు చేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# విశ్రాంత ఉద్యోగులచే సర్‌పై తహశీల్దార్ సమీక్ష




**ప్రజాపక్షం/వైరాః** దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా వైరా పెన్షనర్స్ భవన్ నందు తెలంగాణ రాష్ట్ర రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ పక్షాన విశ్రాంత ఉద్యోగులు..ఓటరు నమోదు పత్రాన్ని పూర్తి చేసే విషయంలో వయోజనులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఓటర్లకు సహకరించాలని సదుద్దేశ్యంతో గత వారం రోజుల నుండి ఉచిత శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుంది. ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ రోజు మన వైరా మండల తహశీల్దార్ చేకూరి సురేష్‌బాబు ఈ శిబిరన్ని సందర్శించి విశ్రాంత ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విశ్రాంత ఉద్యోగులు ఇండ్ల దగ్గర విశ్రాంతి తీసుకోకుండా ఓటర్లకు తమ అమూల్యమైన సేవలను అందించడం నిజంగా అభినందనీయమని వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాఖ పూర్వ కార్యదర్శి ప్రస్తుత తెలంగాణ పెన్షనర్స్ వాయిస్ సబ్ ఎడిటర్ పైడిపల్లి శరత్ బాబు మాట్లాడుతూ వైరా మండల శాఖ ఖమ్మం జిల్లాలోని అన్ని మండల శాఖలకు ఆదర్శంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు చల్లా కృష్ణారావు, మాచర్ల జయశంకర్, ఆర్థిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ జి.రాధిక, బిఎల్‌వోలు శారద, శ్రీలక్ష్మి , నాగమణిపాల్గొన్నారు.

# మొక్కలను నాటడమే కాదు.. వాటిని పెంచి పోషించే బాధ్యత కూడా తీసుకోవాలి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పెనుబల్లి నందు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలోని ఖమ్మం జిల్లా డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ అయిన నర్సింగ్ శ్రీనివాసరావు కళాశాలకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వృక్షో రక్షతి రక్షతిః అనే నినాదంతో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ మొక్కలను నాటడం కాదు వాటిని పెంచి పోషించే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేము ప్రవీణ్ కుమార్ పాల్గొని మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించాలంటే ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రత్నాకర్, సీనియర్ అద్యాపకులు తిరుమలయ్య, నాగేశ్వరరావు, కాషా రావు, దుర్గా మేడం, శేషగిరిరావు, మోహన్ బాబు, హరీష్ బాబు, సుప్రియ మేడం, మీనా మేడం, ప్రకాష్, సత్యవతి పాల్గొన్నారు.

# సిపిఐ బలోపేతానికి సమగ్ర కార్యాచరణ




**- స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు**
**- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**



ప్రజాపక్షం/భద్రాచలం : సిపిఐ పార్టీని గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం స్థానిక రెడ్డిసంత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలే పార్టీ ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉండాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచుతుందని ఆయన స్పష్టం చేశారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలు, నిరోద్యోగం, రైతాంగ సంక్షోభం, కార్మిక సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థ నిర్వీర్యం వంటి అంశాలపై ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.స్థానిక సమస్యలపై ప్రజలతో మమేకమై ఉద్యమాలు చేయాలన్నారు. వాటి పరిష్కారం కోసం అధికారులపై ప్రజాస్వామ్య బద్ధంగా ఒత్తిడి తేవాలన్నారు. దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, ప్రజల హక్కుల కోసం సిపిఐ నితంర పోరాటాలు కొనసాగిస్తుందని హేమంతరావు స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పొందాలని, రానున్న రోజుల్లో విస్తృతంగా ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం చలసాని వెంకట రామారావు భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్రపై బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి, ఖమ్మం జిల్లా కార్యదర్శులు ఎస్‌కే సాబీర్ పాషా, దండి సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వర్లుతో పాటు జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు దివ్య క్షేత్రాల్లో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు



**-ఈశ్వరమాధారం, హుస్నాబాద్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు**
**-మంత్రి పొంగులేటి సతీమణి పొంగులేటి మాధురి**

ప్రజాపక్షం/కూసుమంచి: పారు నియోజకవర్గ పరిధిలో గురువారం ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసింది. కూసుమంచి, తిరుమలాయిపాలెం మండలాల్లో అత్యంత వైభవంగా నిర్వహించిన నూతన ఆలయాల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**శాస్త్రోక్తంగా మాధారేశ్వరుని ప్రతిష్ఠ....**

కూసుమంచి మండలం ఈశ్వరమాధారంలో శ్రీ పార్వతీ సమేత ఈశ్వర మాధారేశ్వరస్వామి వారి శివలింగ, ధ్వజస్తంభ, చండీశ్వర ప్రతిష్ఠాపనలు శాస్త్రోక్తంగా సంపన్నమయ్యాయి. వాటితో పాటు నవగ్రహ, నాగేంద్రస్వామి, గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడవ రోజు వేడుకల్లో భాగంగా జరిగిన వేదమంత్ర హోమాలు, స్థిరయంత్ర స్థాపన, మహా పూర్ణాహుతి క్రతువుల్లో పాల్గొన్న పొంగులేటి మాధురికి అర్చకులు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు.

**హుస్నాబాద్‌లో సీతారాముల కలశ ప్రతిష్ఠ...బచ్చోడులో దర్శనం..**

తిరుమలాయపాలెం మండలం హుస్నాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సీతా సమేత శ్రీ రామాంజనేయస్వామి వారి ఆలయ ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠాపన ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈపర్యటనలో భాగంగానే బచ్చోడు గ్రామంలోని మహిమాన్విత శ్రీ రామాలయాన్ని కూడా ఆమె సందర్శించి తారకరాముని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు.

**నూతన వధూవరులకు ఆశీస్సులు....**

అదే విధంగా పాలేరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని పొంగులేటి మాధురి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా బహూకరించారు.

# నేటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/జూలూరుపాడు: నేడు రాష్ట్రవ్యాప్తంగా జరుగు కేజీ నుండి పీజీ వరకు జరుగు విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఏబీవిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడు మండలంలో విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ మంత్రి కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేసిందని వారు ఆరోపించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల కస్టర్ గా తగ్గిస్తామన్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలకు పిలుపునిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వం కాలయాపన చేసింది వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల కాకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్ లేకుండా యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయకపోవడం దారుణమని వారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న 7000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్స్ స్కాలర్షిప్లను విడుదల చేయాలనే డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్ బాలాజీ అనిల్ సాయి తేజ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికి అండగా, ఆపదలో ఉన్నవారికి తోడుగా ఎమ్మెల్యే డా.మట్టా



ప్రజాపక్షం/సత్తుపల్లి: నియోజకవర్గ ప్రజలందరికీ అండగా ఉంటూ, ఆపదలో ఉన్నవారికి తోడు నిలుస్తూ ముందుకు సాగుతున్నారు సత్తుపల్లి శాసనసభ్యులు డా.మట్టా రాగమయి దయానంద్. గురువారం నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రజలను కలుసుకుంటూ, వారి కష్టాలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ గాంధీనగర్ రోడ్ నెం.6లో మేకల అరుణ కుమారి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్తుపల్లి మండలం సిద్దారం గ్రామంలో నందికొళ కుమారి, సర్వేశ్వరరావు (యాకుబ్) దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి మున్సిపాలిటీ 18వ వార్డు, 3వ వార్డులో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించి, బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి కార్యక్రమ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందిన షేక్ నజీమాకు ఆరోగ్య చికిత్స కోసం రూ.5 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఓ సి)ను ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా సత్తుపల్లి పట్టణం మూడవ వార్డు, సిద్దారం గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల కమిటీలు ప్రమాణాస్వీకారం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఎన్నికల లో విజేతలుగా నిలిచిన పలు కమిటీ ప్రతినిధులు గురువారం ప్రమాణాస్వీకారం చేశారు. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల కు వచ్చిన ఓట్ల ను ఎన్నికల అధికారి, ప్రిన్సిపాల్ జీ.శ్రీలత సమక్షంలో ఓట్ల ను లెక్కించారు. కాలేజీ పీపుల్ లీడర్ (సీపీఎల్) గా కె.స్వాతిక (బైపీసీ సెకండ్ హియర్) 280 ఓట్లు వచ్చాయి. అదే విధంగా స్కూల్ పీపుల్ లీడర్ (ఎసీపీఎల్) గా పదో తరగతి కి చెందిన పి.కీర్తి కి 146 ఓట్లు వచ్చాయి. లిటరరీ లీడర్ గా పదో తరగతి కి చెందిన దుర్గాసామ్య శ్రీ కి 214 ఓట్లు వచ్చాయి. కల్చరల్ కమిటి లీడర్ గా పదో తరగతి కి చెందిన డి.భవిష్య కు 117 ఓట్లు పడ్డాయి. స్పోర్ట్స్ లీడర్ గా 9వ తరగతి కి చెందిన శ్రీపూజిత కు 126 ఓట్లు రావటంతో వీరిని విజయం సాధించినట్లు ఎన్నికల అధికారిగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులతో ప్రమాణాస్వీకారం చేయించారు. విద్యార్థినుల కోసం తాము చిత్తశుద్ధితో పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లిలో అరుణోదయ నాగన్నకు ఘన నివాళి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: అరుణోదయ సాంస్కృతిక సేవ నాయకుడు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు అరుణోదయ నాగన్న సంతాప సభను ఆళ్లపల్లి భగత్‌సింగ్ సెంటర్‌లో నిర్వహించారు. అరుణోదయ మండల అధ్యక్షుడు పూనెం సత్యం అధ్యక్షతన జరిగిన సభలో నాగన్న చిత్రపటానికి ఏఐకేఎంఎస్ డివిజన్ సీనియర్ నాయకుడు బత్తిని సత్యం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి బట్టు ప్రసాద్, ఏఐకేఎంఎస్ భద్రాద్రి జిల్లా నాయకుడు పూనెం రంగయ్య మాట్లాడుతూ ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన విప్లవ గాయకుడు నాగన్న ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అన్నారు. అమరవీరులు, ఆదివాసీ ఉద్యమ నేతలు, రైతులు కూలీల సమస్యలను తన గేయాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించిన సాంస్కృతిక యోధుడిగా నాగన్న చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. జూలై 11న ఇల్లందులో జరిగే నాగన్న సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు మెస్సు గోపాల్, బొర్ర వెంకన్న, అటికం శేఖర్, బత్తిని సత్యం, ఎనగంటి లాజర్, బొమ్మెర్ల వీరన్న, పూనెం మంగ, తోట వీరభద్ర, రమేష్, బత్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/ఇల్లందు: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, జూలై 10(నేడు)జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగటి సాయి పిలుపునిచ్చారు. బంద్ ప్రచారంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నోటీసులు అందజేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు పెంచాలని, ఖాళీ ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండాలలో టిఆర్ఎస్ అధినేత కవిత పర్యటన





ప్రజాపక్షం/గుండాల : ఏజెన్సీ గుండాల మండలంలో టిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత బుధవారం విస్తృతంగా పర్యటించారు ఈ సందర్భంగా ఇటీవల శంభుని గూడెం గ్రామానికి చెందిన తల్లి బిడ్డలు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన చాట్ల వసిఖ కుటుంబాన్ని పరామర్శించి కుటుబాని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు యాభై ఆదివాసి గ్రామాలు ఉండగా కనీసం మండల కేంద్రంలో వైద్యకేంద్రంలో కనీసం పూర్తి స్థాయిలో వైద్యసిబ్బంది లేక పోవడం దారుణమైన విషయమన్నారు. తల్లి బిడ్డ లమృతికి కారణమైన వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ కుటుంబాని అన్నివిదాలుగా తమ పార్టీనుండి అండదండలు ఉటాయని హామి ఇచ్చారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ఆమే వెంట పార్టీ ముఖ్యనాయకులు వాసం రామకృష్ణ ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం/మణుగూరు: పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం మరియు హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అశోక్ నగర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతోంది. ఈ శిబిరం ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా సంఘం కమిటీ సభ్యులు రేఖ రాజశేఖర్, గునిగంటి చందర్, సుంకు కనకరాజు, నమ్మి జగదీష్, తెలంగాణ సురేష్, శ్రీహరి, అనిల్ కాసర్ల, రేవంత్ ప్రజలకు శిబిరాన్ని విజయవంతం చేయాలని, అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందాలని పిలుపునిచ్చారు.

# అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టుల లక్ష్యం





**- దేశంలో అరాచకపాలన సాగుతోంది**
**- హిందుత్వ ఎజెండా ఆధారంగా మోడి పాలన**
**- ప్రపంచ దేశాలు కమ్యూనిజం వైపు చూస్తున్నాయి**
**- పేదల ప్రయోజనాల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధం**
**- కూనంనేని సాంబశివరావు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** దేశంలో అంతరాలు లేని సమాజ స్థాపనే కమ్యూనిస్టుల ఏకైక లక్ష్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, అరాచక పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం రెడ్డిసత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజల విద్యా,వైద్యం, మౌళిక సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రజల ప్రయోజనాలకంటే హిందుత్వ ఎజెండా అమలుకే మోడి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తోందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక సమానత్వం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో అనేక దేశాలు నేడు కమ్యూనిస్టు సిద్ధాంతం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. నిత్యం రామనామ జపం చేస్తే ఈ బిజేపి ప్రభుత్వం ప్రజలను మతం మత్తులో ముంచేందుకు చూస్తోందని, అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వచ్చిన వేల కోట్ల విరాళాలు, బంగారు, వెండి ఆభరణాలను సైతం మాయం చేసిన వారి అమాత్యులు ఏకంగా దేవునికే శఠగోపం పెట్టారని యద్దేవా చేశారు. సమ సమాజ స్థాపన కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని, పేదలు, రైతులు ,కార్మికులు,బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటాలకైనా కమ్యూనిస్టులు సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. పేదల భూములు లాక్కోవడం అన్యాయమని, అలాంటి చర్యలు ఎలాంటి పరిస్థితుల్లోనూ సహించబోమని, అందకే ప్రతీ పేదవానికి భూమి, ప్రతిఇంటికీ పట్టా నినాదంతో ప్రభుత్వ విధానాలను తిప్పికొడతామన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షమ, ప్రజా హక్కుల కోసం నితరం పోరాడుతున్న నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులేనని కూనంనేని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, భద్రాద్రి, ఖమ్మం జిల్లా కార్యదర్శులు ఎస్కే సాబీర్ పాషా, దండి సురేష్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీల్లో సుపరిపాలన దిశగా అడుగుల పడాలి

**-జిపిల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి**
**- వానా కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి : ఎంఎల్‌ఏ కూనంనేని**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామ పంచాయితీల్లో సుపరిపాలన దిశగా అడుగుల పడాలని, గ్రామపంచాయితీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రామ పంచాయితీల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌ల ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాల్లో జరిగింది. కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని గ్రామపంచాయితీల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ గ్రామపంచాయితీల సమగ్రాభివృద్ధి సమన్వయంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామస్థాయి సమస్యలను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హులకే చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగనీరు, పారిశుధ్యం, రహదార్లు, వీధి దీపాల వంటి మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రజాభిప్రాయల మేరకు పాలన సాగాలని, గ్రామాలను పరిశుభ్రంగా, హరితమయంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామాన్ని పెంచాలన్నారు. డిజిటల్ సేవలను గ్రామస్థాయిలో మరింత విస్తరించి ప్రజలకు సులభంగా అందుబాటులోకి తేవాలన్నారు. పంచాయితీల అభివృద్ధిలోమహిళలు, యువత, రైతులు, స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రజల ఆకాంక్షలలకు అనుగుణంగా గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఇల్లెందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల బాగస్వామ్యంతో గ్రామ స్వరాజ్యం పరిడమిల్లాలని కోరారు.

**భద్రాచలంలో :** భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్లో భధ్రాచలం, పినపాక నియోజకవర్గాల గ్రామపంచాయితీల సర్పంచ్‌లు, అధికారులతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా ఎంపి పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాల అభివృద్ధి ఆధారపడి ఉందని చెప్పారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి

**- టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మెడికల్ బోర్డు ఏర్పాటుచేసి సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రెండవ దఫా బాయిబాటలో భాగంగా గురువారం కొత్తగూడెంలో పర్యటించారు. అనంతరం కొత్తగూడెం సూర్యా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడంలో ఇటు సింగరేణి యాజమాన్యం, అటు ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, మధ్యవర్తుల ద్వారా ప్రకటనలు చేయిస్తూ కాలయాపన చేస్తుందని అన్నారు. బేషరతుగా సింగరేణి సంస్థ గాని, ప్రభుత్వం గాని అధికారికంగా మెడికల్ బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేయాలని లేని పక్షంలో ఈ నెల 20న బియంఎస్ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని ప్రకటించారు. ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం నినాదంగా సాగే సింగరేణిలో అధికారులకు ఒకలా, కార్మికులకు ఒకలా ఆరెండు కుటుంబాలుగా ఉందని ఎద్దేవా చేశారు. బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. తాడిచర్ల2 మైనింగ్ కేటాయించి కిషన్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని, నిజాం రాసిచ్చిన 17 గనుల్లో ఇంకా 16 గనులు బేషరతుగా సింగరేణికి అప్పగించాలని కోరారు. నేను పార్టీ పెట్టుకొని నా పని నేను చేసుకుంటూ పోతున్నాను ఇప్పటి వరకు కూడా బీఆర్ఎస్ విషయంలో ఎక్కడ పర్సనల్ విషయాలు మాట్లాడలేదు. పార్టీ పెట్టిన ఆరు నెలల వరకు అన్ని పార్టీల గురించి మాట్లాడి ఆ తరువాత ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను. కానీ నా పార్టీతో భయం లేదంటూనే బీఆర్ఎస్ వాళ్లు వెయ్యికి పైగా ఈసీకి కంప్లైంట్స్ ఇచ్చారు. నా కంఠంలో ప్రాణమున్నంత వరకు మళ్ళీ బిఆర్ఎస్ పార్టీలో చేసే ప్రసక్తే లేదని బావోద్వేగంతో అన్నారు. దమ్ముంటే నాతోపాటు ప్రజా సమస్యల పోరాటం విషయంలో పోటీ పడండంటూ సవాల్ విసిరారు. నేను పార్టీ స్థాపించి 73వ రోజులైందని ఇప్పటి వరకు ఎన్ని పోరాటాలు చేసామో మీకే తెలుసునని మీడియాను ఉద్దేశించి అన్నారు. ఈ సమావేశంలో కవితతోపాటు స్థానిక టిఆర్ఎస్ నాయకులు, బియంఎస్ నాయకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటనకు భారీ పోలీస్ బందోబస్తు





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** చింతకాని మండలం జగన్నాధపురంలో నేడు జరుగనున్న ప్రజాశీర్వాద సభకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. గురువారం సభ స్థలిని ఆయన సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రత ఏర్పాట్లపై సూచనలు చేశారు. భద్రతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బందోబస్తు విధుల్లో 1500 మంది సిబ్బంది పాల్గొనన్నున్నట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధినిర్వహణలో పాటించవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో సిఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా బందోబస్తు వివరాలను వెల్లడించారు. అడిషనల్ డిసిపిలు 4, ఏసిపిలు 12, సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు 58, ఎస్ఐలు, రిజర్వ్డ్ ఎస్సైలు 151, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు 1300 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ తెలిపారు.

# రైతు ఆశ్వీరాద సభకు ముందే పూర్తి రుణమాఫీ చేయాలి



**ప్రజాపక్షం/బోనకల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 10వ తేదిన నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు ముందే రాష్ట్రంలోని రుణమాఫీకి నోచుకొని రైతులందరికీ పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ ఈ నెల 10న జరగనున్న రైతు ఆశీర్వాద సభకు తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీవిక్రమార్క హాజరై వ్యవసాయ సంక్షేమం, ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించనున్న నేపథ్యంలో సభలో హామీలు ఇవ్వడం కంటే ముందుగా పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు. రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే , రెండు లక్షలకు పైగా పంట రుణాలు ఉన్న రైతులకు కూడా వెంటనే రుణమాఫీ చేయాలని, అప్పుల భారం నుంచి వారిని విముక్తి చేయాలని కోరారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే, రైతు ఆశీర్వాద సభను కేవలం ప్రచార వేదికగా కాకుండా రైతులకు నిజమైన భరోసా ఇచ్చే వేదికగా మార్చాలని ఆనందరావు సూచించారు. ఈ సమావేశంలో ఏఐకెఎస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, బిసిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ మందిరం దగ్గర ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ అధ్యక్షతన జరిగిన సర్ అవగాహన సదస్సులో కొణిజర్ల ఎమ్మార్వో ఆఫీస్ ఏఎస్‌వో తిరుపతిరావు, బిఎల్‌వోల సూపర్‌వైజర్ జిపివో బాలరాజు మాట్లాడుతూ ఓటర్లు అడిగిన వివిధ ప్రశ్నలకు అందరికి అర్ధమయ్యేలా క్లియర్‌గా సమాధానం చెప్పడం జరిగింది. ప్రతిఒక్కరి ఓటు ఎక్కడికి పోదు అని కాకపోతే మ్యాపింగ్ అయిన వాళ్లవి ఎటువంటి రిస్క్ లేకుండా లిస్ట్‌లో వస్తాయని, మ్యాపింగ్ కాని వాళ్లవి ఆగస్ట్1న పెట్టే ఓటర్ల జాబితాలోవాళ్ల వివరాలు ఉండవని అలాంటి వాళ్ళు ఆగస్టు 11రకాల సర్టిఫికెట్స్‌లో ఏదో ఒకటి ఇస్తే సరిపోతుందని, అదేవిధంగా మ్యాపింగ్ కాని వాళ్ళు ఇప్పుడు ఫామ్ ఇవ్వాల్సిన అవసరం లేదని వాళ్ళు ఆగస్ట్1 తర్వాత ఇవ్వాల్సి ఉటుందని తెలియజేశారు. కొత్తగా పెళ్లైన ఆడవాళ్ళు వాళ్ళ తల్లి ఇంటి దగ్గరే ఓటు ఉంటే ప్రస్తుతం అక్కడే మ్యాపింగ్ చేసుకోవాలని, షిఫ్టింగ్‌కి ఇప్పుడు అవకాశం ఉండదని ఆగస్ట్1 తర్వాత షిఫ్టింగ్‌కి అవకాశం ఉంటుందని తెలియజేశారు. రెండు చోట్ల ఓటు ఉన్న వాళ్లకి ఓటు హక్కు ఏ ప్రాంతంలో కావాలో అక్కడ సర్ ఫామ్ నింపితే సరిపోతుందని, రెండో ఓటు ఉన్న దగ్గర ఫామ్ నింపకుండా ఉంటే సరిపోతుందని తెలియజేశారు. కొత్తగా ఓటు అప్లై చేసుకునే వాళ్లు ఫామ్6 ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని, అదేవిధంగా మీ పిల్లలు ఎవరైనా ఇతర దేశబూల్లో ఉంటే వారికి 18 సంవత్సరాలు నిండితే వారికి ఇక్కడ ఓటు హక్కు పొందాలంటే ఎన్ఆర్ఐ ఫామ్ 6ఏ ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా ఓటరు కార్డులో పేరు కాని అడ్రస్ కాని తప్పుగా ఉంటే దాని కోసం ఫామ్8 ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని తెలియజేశారు. ఇలా ఈ అవగాహన సదస్సులో పాల్గొని ఓటర్లు అడిగిన ప్రతి సందేహాన్ని క్లియర్‌గా వారికి అర్ధం అయ్యేలా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ బత్తుల సుమతి, ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిఒక్కరూ ఈ సర్ ఫామ్ నింపి తమ ఓటు హక్కును కోల్పోకుండా చూసుకోవాని తెలియజేశారు. అనంతరం ఫామ్ ఫిల్ చేయడం రాని వారికి బిఎల్‌వోలు అయిన రాచబంటి అప్పమ్మ, జట్ల మమత, లక్ష్మి, నరసింహారావు ఈ అవగాహన సదస్సుకి వచ్చిన వారికి సర్ ఫామ్ నింపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించిన తిరుపతిరావు, బాలరాజు అదేవిధంగా సర్ ఫామ్ కోసం గత కొంతకాలంగా పల్లిపాడు గ్రామంలో తమ విశిష్ట సేవలను అందిస్తున్న బిఎల్‌వోలు మమత, అప్పమ్మ, లక్ష్మి, నర్సింహారావులను ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మేడా మోహన్‌రావు, పారుపల్లి శ్రీనాథ్, కావూరి కోటేశ్వరరావు, మేడా సైదులు, షేక్ బుడన్‌సాహెబ్, రాచబంటి బాలకృష్ణ, ఎనగంటి కృష్ణ, మేడా నరసింహారావు, పాకాలపాటి నరేష్, పాటి కార్తీక్, మేడా యశ్వంత్, గుర్రం అప్పారావు, గుత్తా కృష్ణయ్య, బత్తిరన్న, మేడా నాగయ్య, అశ్వారావుపేట అగ్రికల్చర్ కళాశాల విద్యార్థినిలు, పల్లిపాడు గ్రామ ఓటర్లు పాల్గొన్నారు.